



# అందని ఆసరా..

- 20 రోజులు ఆలస్యమైనా ఇంకా ఆలస్యంగా పింఛన్లు
- ఆసరా పింఛన్ల పంపిణీపై ప్రభుత్వం నుంచి నో క్లారిటీ
- అధికారం చేపట్టిన మొదటి నెల నుంచే పింఛన్‌దారులకు తప్పని తిప్పలు
- డిసెంబర్ నెల నుంచి పింఛన్ల కోసం లబ్ధిదారుల ఎదురుచూపులు
- పింఛన్ డబ్బులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్న పండుటాకులు
- పింఛన్ డబ్బులతోనే బతుకుతున్న మెజార్టీ వృద్ధాప్య పింఛన్‌దారులు
- పింఛన్ డబ్బులు వస్తాయో రావోనని ప్రతి నెలా లబ్ధిదారుల్లో అయోమయం

వికారాబాద్, జూన్ 10, (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆసరా పింఛన్‌దారులకు కష్టాలు మొదలయ్యాయి. ఆసరా పింఛన్‌తోనే బతుకుతున్న పండుటాకులు, దివ్యాంగులకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన మొదటి నెల నుంచే పింఛన్ డబ్బుల కోసం ఆందోళన మొదలైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్ నియోజకవర్గంలోని పింఛన్‌దారులు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పింఛన్ డబ్బుల కోసం ఎదురుచూస్తుండడం గమనార్హం. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి నెలా 20వ తేదీ లోగా పింఛన్లను అందజేయగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన మొదటి నెల నుంచే ఆసరా పింఛన్ల పంపిణీ ఆలస్యం కావడంతో పింఛన్‌దారుల్లో అయోమయం నెలకొన్నది. ప్రతి నెలా పింఛన్ డబ్బుల కోసం కోసం ఎదురుచూడాల్సి వస్తుండడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా మిగతా నియోజకవర్గాలకు పింఛన్ డబ్బులు పంపిణీ ఆలస్యమైనప్పటికీ, సీఎం ప్రాతినిథ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గానికి ప్రతీనెల పింఛన్ డబ్బులు ఆలస్యం కావడంపై జిల్లాలో చర్చానీయాంశంగా మారింది. అంతేకాకుండా ప్రతి నెల 20వ తేది వరకు పింఛన్ డబ్బులను అందజేసిన కేసీఆర్ ప్రభుత్వాన్ని ఆసరా పింఛన్‌దారులు కొనియాడుతూ గుర్తు చేసుకుంటున్నారు. అయితే కొడంగల్ నియోజకవర్గానికి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ఆసరా పింఛన్ల నిమిత్తం నిధులు మంజూరు అవుతుండగా, మిగతా వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాలకు రంగారెడ్డి జిల్లా నుంచి నిధులు మంజూరు చేస్తూ వస్తున్నారు.

### ప్రతి నెలా పింఛన్ పంపిణీలో జాప్యం...

ఆసరా పింఛన్‌తోనే బతుకుతున్న పండుటాకులు, దివ్యాంగులకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన మొదటి నెల నుంచే ఆందోళన మొదలైంది. ప్రతీ నెలా పింఛన్ల పంపిణీలో జాప్యం జరుగుతున్నది. జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాల్లోని పింఛన్‌దారులకు పింఛన్ డబ్బుల పంపిణీ ప్రతి నెలా 29 లేదా 30 తేదీన ప్రారంభమై వారం రోజుల్లో అందజేస్తుండగా, కొడంగల్ నియోజకవర్గంలోని పింఛన్‌దారులు మాత్రం పింఛన్ డబ్బుల కోసం మొదటి వారం పూర్తయ్యే వరకు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొన్నది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి నెల 20వ తేది లోగా పింఛన్లను అందజేయగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన మొదటి నెల నుంచే ఆసరా పింఛన్ల పంపిణీ ఆలస్యం కావడంతో పింఛన్‌దారుల్లో అయోమయం నెలకొన్నది. అయితే ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన పింఛన్ డబ్బులు ఇంకా అందకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గత నెల పింఛన్ డబ్బులు ఈనెల మొదటి వారం వరకు అందిస్తు వస్తుండగా, ప్రస్తుతం మరింత ఆలస్యం కావడం గమనార్హం. అయితే జిల్లా వ్యాప్తంగా 98,793 మంది పింఛన్‌దారులకు రూ.24.38 కోట్ల పింఛన్ డబ్బులను పంపిణీ చేస్తున్నారు.

### ఇంకా పాత పింఛన్లే..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా పేద ప్రజలకు ఇచ్చిన హామీలు మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. కేవలం ఆరు గ్యారెంటీలకు సంబంధించి ప్రస్తావించడం మినహా మిగతా హామీలపై ఇప్పటివరకు ప్రస్తావించకపోవడం గమనార్హం. ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే వెంటనే వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు తదితరులకిచ్చే రూ.2016 పింఛన్ డబ్బును రూ.4 వేలకు, దివ్యాంగులకు ఇచ్చే రూ.4016 పింఛన్ డబ్బులను రూ.6 వేలకు పెంచుతామని హామీనిచ్చారు. కాంగ్రెస్ పార్టీ మాటలు నమ్మి ఓటేసి గెలిపించిన ఆసరా పింఛన్‌దారులు పింఛన్ల పెంపు ఎప్పుడో అంటూ ఆశగా ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఆరు గ్యారెంటీలంటూ ప్రచారం చేస్తున్నప్పటికీ అమలుకు తెల్లరేషన్ కార్డు తప్పనిసరి చేయడంతో పేద ప్రజలు ఎంతో మందికి పథకాల ఫలాలు అందడం లేదు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని ప్రజలు గగ్గోలు పెడుతున్నా పట్టించుకోకపోవడం గమనార్హం. అదేవిధంగా పింఛన్ డబ్బులు పెంచుతామని హామీనిచ్చినప్పటికీ ఇంకా పాత పింఛన్లే ఇస్తుండడం గమనార్హం.



హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్‌రావుకు విద్యాదాత అవార్డును అందజేస్తున్న వందేమాతరం ఫౌండేషన్ సభ్యులు

### హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావుకు

# విద్యాదాత పురస్కారం

- స్వగ్రామం దండుమైలారంలో రూ.75 లక్షలతో ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణం
- ఆయన సేవలను గుర్తించి అవార్డుతో సన్మానించిన వందేమాతరం ఫౌండేషన్
- అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉన్నది : హెచ్‌సీఏ అధ్యక్షుడు

ఇబ్రహీంపట్నం రూరల్, జూన్ 10 : పుట్టిన ఊరు రుణం తీర్చుకోవాలన్న సంకల్పంతో పాటు గ్రామంలోని ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చి అందరికీ ఆదర్శంగా నిలిచారు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడిగా ఉన్న అరిషణపల్లి జగన్మోహన్ రావు. ఆయన మండలంలోని దండుమైలారం గ్రామానికి చెందిన వారు. సొంత నిధులు, రౌండ్‌టేబుల్ ఆర్గనైజేషన్ సహకారంతో ఊరిలోని జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు మౌలిక వసతులు, అదేవిధంగా ప్రాథమిక పాఠశాల భవనాన్ని రూ.75 లక్షలతో సకల హంగులతో కార్పొరేట్ పాఠశాలకు దీటుగా నిర్మించారు. దీంతో ఆయన సేవలను గుర్తించిన వందేమాతరం ఫౌండేషన్ సభ్యులు సోమవారం నగరంలోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు విద్యాదాత పురస్కారాన్ని అందించారు. ఈ అవార్డును ఆయన వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవీందర్, మాజీ ఐఏఎస్ అధికారి జయప్రకాశ్‌నారాయణ, సెయింట్ సంస్థ వ్యవస్థాపకుడు మోహన్ రెడ్డి, విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఫ్లైటెక్ ఏవియేషన్ అకాడమీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మమత చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌రావు మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి వందేమాతరం ఫౌండేషన్ విద్యాదాత పురస్కారాన్ని అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని.. గ్రామంలో ఎలాంటి ఇబ్బందులున్నా సహకరిస్తానని తెలిపారు. జగన్మోహన్‌రావుకు విద్యాదాత అవార్డు రావడం దండుమైలారం గ్రామానికి ఎంతో గర్వకారణమని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు రవణమోని జంగయ్యముదిరాజ్, సహకార సంఘం చైర్మన్ బిట్ల వెంకట్‌రెడ్డి, పలువురు గ్రామ పెద్దలు అభినందించారు.

## నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం



రంగారెడ్డి, జూన్ 10 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ తీగల అనితా హరినాథ్‌రెడ్డి అధ్యక్షతన 11వ తేదీన ఉదయం 11 గంటలకు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈవో సీహెచ్ కృష్ణా రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు సకాలంలో సమావేశానికి రావాల్సిందిగా కోరారు.

# 'మిషన్'పై నజర్



గత ఆరునెలల కాలంలో మిషన్ భగీరథ పథకం నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. ఈ పథకం నిర్వహణ గ్రామ పంచాయతీలకు అప్పగించాక నీటి సరఫరా లోపభూయిష్టంగా మారింది. లీకేజీల వల్ల కొన్ని చోట్ల స్వచ్ఛనీరు కలుషితమవుతున్నది. ఇక వర్షకాలంలో రోగాలు ముసిరే పరిస్థితులు రానుండడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. జిల్లాలో మిషన్ భగీరథ పథకం వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు ఇంటింటి సర్వే చేపడుతున్నది. జిల్లాలో సోమవారం నుంచే సర్వే ప్రారంభమైంది. యాప్ ద్వారా సమగ్ర వివరాలు సేకరించాక.. ప్రభుత్వం తగు చర్యలు తీసుకోనున్నది. పథకం నిర్వహణకు నిధుల కొరత రాకుండా అవసరమైతే కేంద్ర జలశక్తి నుంచి నిధులను సమీకరించుకోవాలని ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తున్నది.

- రంగారెడ్డి, జూన్ 10 (నమస్తే తెలంగాణ)

- ఆరు నెలల కాలంలో అస్తవ్యస్తంగా మారిన మిషన్ భగీరథ నిర్వహణ
- వర్షకాలం రావడంతో అప్రమత్తమైన ప్రభుత్వం
- క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న ప్రభుత్వం
- రంగారెడ్డి జిల్లాలో మొదలైన సర్వే.. ఎప్పటికప్పుడు వివరాల నమోదు
- నిధుల కొరత లేకుండా కేంద్ర జలశక్తి నుంచి నిధులు సమీకరించుకునే ఆలోచనలో ప్రభుత్వం!



### 1,072 ఆవాసాలకు కృష్ణా జలాల సరఫరా..

కేసీఆర్ ప్రభుత్వంలో శ్రీకారం చుట్టిన మిషన్ భగీరథ పథకం దిగ్విజయంగా అమలైంది. కేంద్రంపై ఆధారపడకుండా రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా నిధులను సమీకరించి ఈ పథకాన్ని అమలు చేసింది. రూ.476కోట్ల నిధులు వెచ్చించి పనులను చేపట్టగా.. జిల్లాలోని 22 మండలాల పరిధిలో ఉన్న 1,072 ఆవాసాలకు శుద్ధ జలాలు పంపిణీ అవుతున్నాయి. శ్రీశైలం బ్యాక్ వాటర్ పరివాహక ప్రాంతంలో ఉన్న యెల్లూరు రిజర్వాయర్ నుంచి సేకరించిన నీటిని ముచ్చెర్ల(కందుకూరు), అంతారం(షాబాద్), కమ్మదానం(షాద్‌నగర్), కల్వకుర్తిలోని వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ద్వారా శుద్ధి చేసి ఆవాసాలకు తరలిస్తున్నారు. ఇందుకు సంబంధించి నూతనంగా 877 వాటర్ ట్యాంకులను నిర్మించి 3,236కిలోమీటర్ల మేర పైపులైన్ వేశారు. గడపగడపకు నీరందించే ఉద్దేశంతో 2,94,705 నల్లా కనెక్షన్లను సైతం ఏర్పాటు చేశారు. సాగర్ బ్యాక్ వాటర్ నుంచి తరలివచ్చే నీటి శుద్ధి ప్రక్రియను గత ప్రభుత్వం పకడ్బందీగా చేపట్టింది. క్లోరినేషన్ ప్రక్రియను పూర్తి చేసుకున్న నీటిని ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించాకనే స్వచ్ఛమైన నీటిని ఆవాసాలకు సరఫరా చేశారు. అయితే గత ఆరు నెలల కాలంలో పరిస్థితి అంతా తలకిందులైంది. మిషన్ భగీరథ పథకం బాధ్యతలను గ్రామ పంచాయతీలకు అప్పగించాక.. పథకం నిర్వహణ గాడితప్పింది. నిధుల కొరతతో కనీసం లీకేజీలు, పైపులైన్ మరమ్మతులను చేయడం సైతం ప్రత్యేకాధికారులకు కష్టంగా మారింది. కొన్ని చోట్ల నీరు కలుషితం అవుతుండడం.. వచ్చేది వర్షాకాలం కావడంతో పొంచి ఉన్న రోగాలతో ప్రజానీకం ఆందోళన చెందుతున్నది.

### వాస్తవ పరిస్థితులు తెలుసుకునేందుకే !..

క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు ప్రభుత్వం సర్వే నిర్వహిస్తున్నది. వాస్తవానికి మిషన్ భగీరథ పథకంలో ప్రస్తుతం అనేక సమస్యలు ఏర్పడ్డాయి. పైపులైన్ పనులు, లీకేజీ మరమ్మతు పనులు అస్తవ్యస్తంగా మారాయి. కుళాయిల ద్వారా ఇంటింటికీ సక్రమంగా తాగునీటి సరఫరా జరగడం లేదు. ప్రస్తుతం నెలకొన్న ఈ పరిస్థితులను సర్వే బృందాలు సమగ్రంగా సేకరించనున్నాయి. పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీలు, ఐకేపీ, ఉపాధి హామీ సిబ్బందిని సర్వేలో భాగస్వామ్యం చేస్తున్నారు. సర్వే సందర్భంగా ఇంటింటికీ వెళ్లి.. కుళాయిలు ఉన్నాయా? ఉంటే సక్రమంగా నీటి సరఫరా జరుగుతున్నదా!.. కుటుంబ అవసరాలకు సరిపడా నీరు సరఫరా అవుతుందా? లేదా!.. పైపు లైన్ లీకేజీలు ఉన్నాయా? వంటి తదితర వివరాలను సేకరించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు. కుటుంబ సభ్యుల వివరాలు, ఫోన్ నంబర్లు, ఆధార్ నంబర్లను సైతం సేకరిస్తారు. కొత్తగా చేపట్టాల్సిన పనులు, నిధులు ఎన్ని అవసరమో! అంచనా వేస్తారు. యజమానితో కలిసి ఇంటి ఫొటో, కుళాయి ఫొటోలను సైతం యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. గ్రామాల వారీగా సేకరించిన సమాచారం మండలాలకు.. ఆ తర్వాత జిల్లాకు చేరుతుంది. వివరాలన్నింటినీ క్రోడీకరించిన తర్వాత పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నారు. సర్వే నిర్వహణపై కొద్దిరోజుల క్రితమే రాష్ట్రస్థాయిలో మిషన్ భగీరథ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీరాజ్ శాఖ అధికారులకు శిక్షణ ఇచ్చారు. జిల్లాలోనూ సర్వేలో పాల్గొనే సిబ్బందికి శిక్షణ పూర్తయ్యింది. జిల్లాల నుంచి నివేదికలు వచ్చాక మిషన్ భగీరథ నిర్వహణకు జల్ జీవన్ మిషన్ కింద నిధులు పొందేందుకు అవసరమైన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపనున్నట్లు తెలుస్తున్నది.

### జిల్లాలో సర్వే ప్రారంభం..

మిషన్ భగీరథ పథకం వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు ప్రభుత్వం సర్వే నిర్వహిస్తున్నది. వివిధ శాఖల సిబ్బంది సోమవారం నుంచే క్షేత్రస్థాయిలో పర్యటించి సర్వే చేస్తున్నారు. ఎప్పటికప్పుడు వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. వారం, పది రోజుల్లో సర్వే పూర్తయ్యే అవకాశం ఉన్నది. పూర్తిస్థాయి నివేదికను ప్రభుత్వానికి నివేదిస్తాం.

– సురేశ్‌మోహన్, డీపీవో, రంగారెడ్డి జిల్లా

### మూడు నెలల తర్వాత ప్రజావాణి..

# ఫిర్యాదుల వెల్లువ

వికారాబాద్, జూన్ 10 : మూడు నెలలుగా రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల కోడ్ కారణంగా ప్రజావాణి నిలిచిపోయింది. ఈ నెల 6న కోడ్ ముగియడంతో సోమవారం రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ప్రజావాణి ప్రారంభం కాగా, ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌తో కలిసి ప్రజల నుంచి 96 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాఖలవారీగా పెండింగ్‌లో ఉన్న వివిధ పనులు త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల్లో జరుగుతున్న పనులను అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పూర్తయ్యేలా చూడాలన్నారు. ఈ నెల 12 నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా మెరుగైన వసతులు కల్పించాలన్నా రు. పాఠ్య, నోట్ పుస్తకాలతోపాటు యూనిఫామ్‌ను అందించాలని అధికారులకు సూచించారు. పాఠశాలల మరమ్మతుల నిమిత్తం రూ.50 కోట్లు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. బడిబాటలో భాగంగా అధిక సంఖ్యలో బడీడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా బడిబాటలో మహిళా సంఘాలు భాగస్వాములు అయ్యేలా చొరవ చూపాలన్నారు. జిల్లాలోని పాఠశాలలు, వసతిగృహాల్లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు ఏమైనా మరమ్మతులుంటే పూర్తి చేయాలన్నారు.

★ ప్రభుత్వ ఉద్యోగులందరూ అటెండెన్స్ యాప్‌లో తమ హాజరును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

### పెండింగ్ పనులు పూర్తి చేయాలి : వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

హాజరు నమోదులో ఎలాంటి నిర్లక్ష్యం తగదన్నారు.

★ జిల్లాలో ఎరువులు, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరకే వాటిని విక్రయించేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయించకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు.

★ జిల్లాలో మిల్లర్లకు నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా సీఎంఆర్ (మిల్లులు పట్టిన బియ్యం) వచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. మిల్లర్ల సామర్థ్యాన్ని బట్టి సీఎంఆర్ వచ్చేలా దృష్టి సారించాలన్నారు.

★ ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి ప్రజా సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడం లేదా అత్యవసరమైన పనులుంటే కలెక్టర్‌కు సమాచారమిచ్చి అనుమతి తీసుకోవాలన్నారు. సమాచారం లేకుండా ప్రజావాణికి గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు ఇస్తామని హెచ్చరించారు. ప్రజావాణిలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

### దరఖాస్తులు స్వీకరించిన రంగారెడ్డి కలెక్టర్ శశాంక

### రంగారెడ్డి జిల్లాలో

# 79 దరఖాస్తులు



ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, జూన్ 10 (నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికల సందర్భంగా తాత్కాలికంగా నిలిచిపోయిన ప్రజావాణి కార్యక్రమాన్ని అధికారులు పునరుద్ధరించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ శశాంక అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డితో పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి 79 ఫిర్యాదులు వచ్చాయని .. వాటి పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లాకు సంబంధించి ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులకు పంపించడం జరుగుతున్నదని.. అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ఒకవేళ వినతులు పరిష్కారం కాకుంటే అందుకు గల కారణాలను స్పష్టంగా పేర్కొనాలని సూచించారు.

ప్రజావాణి రిజిస్టర్‌ను విధిగా నిర్వహించాలని, రిజిస్టర్‌లో నమోదు చేయడంవల్ల ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి? వాటిలో ఎన్ని పరిష్కరించడం జరిగింది? ఎన్ని పెండింగ్‌లో ఉన్నయో తెలుస్తుందని తెలిపారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి ఉదయం 10.30 గంటలకు జిల్లా, మండల, మున్సిపల్ స్థాయి అధికారులందరూ రావాలని సూచించారు. ప్రజావాణిలో డీఆర్వో సంగీత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.